క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్‌: మైనార్టీ బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని టీఎంఆర్‌ఈఐఎస్‌ జిల్లా ప్రాంతీయ సమన్వయాధికారి సుధారాణి, మైనార్టీ బాలుర పాఠశాల ప్రిన్సిపాల్‌ కిరణ్‌కుమార్‌ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మైనార్టీ బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో 2025–26కు గాను ఐదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో 60 మైనార్టీ, 20 నాన్‌ మైనార్టీ సీట్లతో పాటు 6, 7, 8 తరగతుల్లో బ్యాక్‌లాగ్‌ ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఫిబ్రవరి 28లోపు ౖరుఖ్టఛీౌట్ఛ ౖ ఖఝ ౖఛిజజ.జౌఠి.జీ ఽ వెబ్‌సైట్లో లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఐఐటీ, నీట్‌కు ప్రారంభం నుంచి ప్రత్యేక శిక్షణ ఇస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాగునీటి సమస్యలు రానివ్వం


గ్రామస్తులతో మాట్లాడుతున్న కృష్ణ

మద్దూరు(హుస్నాబాద్‌): రాబోయే వేసవి దృష్ట్యా గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని ఆర్‌డబ్ల్యూస్‌ డీఈ కృష్ణ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని వల్లంపట్ల, రేబర్తి గ్రామాల్లో గురువారం స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. అందులో భాగంగా వాటర్‌ట్యాంక్‌, సంప్‌లో సరాఫరా అవుతున్న నీటిని పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి తాగునీటి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కిరణ్‌ తదితరులు ఉన్నారు.

ఎంపీడీఓకు సన్మానం


ఎంపీడీఓను సన్మానిస్తున్న నాయకులు

కొండపాక(గజ్వేల్‌): కుకునూరుపల్లి ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టి మొదటి సారిగా గ్రామాన్ని సందర్శించిన ఎంపీడీఓ రాంప్రసాద్‌ను గురువారం మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు భగవాన్‌ ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. ఎంపీడీఓ మండల పరిధిలోని చిన్న కిష్టాపూర్‌ను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ రెడ్డి, భగవాన్‌, సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్‌చారి, రాజాగౌడ్‌, సంపత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో గేదె మృతి


గేదె కళేబరం వద్ద కనకయ్య, గ్రామస్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): పాముకాటుతో గేదె మృతి చెందిన ఘటన మండలంలోని గురువన్నపేటలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బ్రహ్మడ్లపల్లి కనకయ్య తన పొలం వద్ద బుధవారం రాత్రి పశువులను కట్టివేసి ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం వెళ్లి చూసే సరికి పాముకాటుతో గేదె మృతి చెందినట్లు గుర్తించాడు. దాని విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని, ఆయనను ఆదుకోవాలని స్థానికులు కోరారు.

పన్నులు చెల్లిస్తేనే అభివృద్ధి

గజ్వేల్‌రూరల్‌: మున్సిపాలిటీ పరిధిలోని గృహ, వాణిజ్య సముదాయాల యజమానులు పన్నులు చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మున్సిపల్‌ కమిషనర్‌ గోల్కొండ నర్సయ్య పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ కమర్షియల్‌ షెడ్డులు, పెట్రోల్‌ బంక్‌లు, గోదాములతో పాటు ఇంటి నంబర్లు లేకుండా ఉన్న వాటిని గుర్తించి పది రోజుల్లోగా అనుమతులు తీసుకోవాలని సూచించామన్నారు. అదే విధంగా ట్రేడ్‌ లైసెన్సులు లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారు వెంటనే లైసెన్సులు పొందాలని చెప్పారు. అలాగే పలు టిఫిన్‌ సెంటర్లు, బేకరీలను మున్సిపల్‌ అధికారులు తనిఖీ చేసి ప్లాస్టిక్‌ వినియోగం తగ్గించాలని, పరిశుభ్రత పాటించాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్‌ డిజిటల్‌ కంటెంట్‌ పుస్తకాలు అందజేత

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): పదోతరగతి విద్యార్థులు పరీక్షల్లో రాణించేందుకు ఉపయోగపడే విధంగా కేసీఆర్‌ డిజిటల్‌ కంటెంట్‌ బుక్‌లను మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఉపాధ్యాయుల ద్వారా గురువారం పదోతరగతి విద్యార్థులకు అందజేశారు.

● ట్రాన్స్‌ కో.. జర దేఖో..


రక్షణ చర్యలులేని విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌

అక్కన్నపేట మండలం సేవాలాల్‌ మహారాజ్‌ తండాలో ఇండ్ల మధ్య రోడ్డుకు ఆనుకొని ఉన్న ఓ విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ చుట్టూ కంచె కాని ఎలాంటి రక్షణ వలయం కాని ఏర్పాటు చేయలేదు. అంతేకాకుండా ఇండ్ల నడుమ, రోడ్డుకు అనుకొని ఉండడంతో చిన్న పిల్లలు, మూగజీవాలు, మేకలు తదితర నిత్యం అక్కడే తిరుగుతూ ఉంటాయి. దీంతో ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాలు జరుగుతాయని స్థానికులు వాపోతున్నారు. ట్రాన్స్‌ కో అధికారులు దృష్టిసారించి చుట్టూ కంచె లాంటి రక్షణ వలయం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● పూర్తయ్యేది ఎప్పుడో..


నిలిచిన రేగొండ ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణ పనులు

మండలం పరిధిలోని రేగొండలో నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణ పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం హయాంలో అప్పటి మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌ రూ.20లక్షల వ్యయంతో ఈ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దాదాపు మూడేళ్లు దాటుతున్నా భవన నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం నాలుగైదు నెలలుగా భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచి పోయాయి. దీంతో వైద్య ఆరోగ్య సిబ్బంది, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకొని చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

–అక్కన్నపేట(హుస్నాబాద్‌):

గీత దాటితే చర్యలు తప్పవు

హుస్నాబాద్‌: దుకాణాల ఎదుట ప్రజలకు ఇబ్బంది కలిగేలా వాహనాలు నిలిపినా, బోర్డులు ఏర్పాటు చేసినా చర్యలు తప్పవని మున్సిపల్‌ కమిషనర్‌ మల్లికార్జున్‌, ఎస్‌ఐ మహేశ్‌ హెచ్చరించారు. మెయిన్‌ రోడ్‌, అంబేడ్కర్‌ చౌరస్తా, అక్కన్నపేట రోడ్‌లో మున్సిపల్‌, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో గురువారం ట్రాఫిక్‌ నిబంధనలపై దుకాణాదారులకు అవగాహన కల్పించారు. దుకాణాల ఎదుట మార్కింగ్‌ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లపైనే పండ్ల బండ్లు, టీ స్టాళ్లు ఇతర దుకాణాలు నిర్వహించడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. మార్కింగ్‌ను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


బోర్డులు తొలగిస్తున్న సిబ్బంది

కాంగ్రెస్‌ వైఫల్యాలను ఎండగట్టండి


మద్దూరు(హుస్నాబాద్‌): మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి తదితరులు

మద్దూరు(హుస్నాబాద్‌): కాంగ్రెస్‌ వైఫల్యాలను ప్రజల మధ్య ఎండగట్టాలని మాజీ ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని నర్సయపల్లిలో బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులతో కలిసి గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అత్యధిక స్థానాలు గెలిచేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. కాంగ్రెస్‌ పార్టీ ప్రజలకిచ్చిన ఎన్నికల హామీలను తుంగలోతొక్కి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, రుణమాఫీ పూర్తి చేయకుండా రైతులను ముంచిందని వాపోయారు. కార్యక్రమంలో క్లస్టర్‌ ఇన్‌చార్జిలు నాగేశ్వర్‌రావు, ఇన్నారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు యాదగిరి, నాయకులు బాల్‌రెడ్డి, రాములు, నర్సిరెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యం..

నంగునూరు(సిద్దిపేట): రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ పార్టీ మండల అధ్యక్షుడు లింగంగౌడ్‌ పిలుపునిచ్చారు. నర్మేట, అప్పలాయిచెర్వు, మైసంపల్లి గ్రామాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నాయకులు భూపేశ్‌, సారయ్య, రమేశ్‌గౌడ్‌, అజీద్‌, బాబు, రాజిరెడ్డి, నారాయణ, శ్రీనివాస్‌, రాజేల్లయ్య, కల్పన, రవీందర్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి

చెరుకు శ్రీనివాస్‌రెడ్డి


చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): పేదల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని కాంగ్రెస్‌ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చందాపూర్‌కు చెందిన మదునాల శశాంక్‌కు మంజూరైన రూ.2.50 లక్షల సీఎం సహాయనిధి చెక్కును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేదలకు ఆసరాగా నిలుస్తోందన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్నానని చెప్పారు. ఎల్లవేళలా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తామని, ఏ అవసరం వచ్చినా తనకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు సుప్రభాతరావు, జిల్లా నాయకులు విజయ్‌రెడ్డి, వెంగళరావు, విజయ్‌పాల్‌రెడ్డి, ప్రవీణ్‌ కుమార్‌, రాజాగౌడ్‌, శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

మాదిగల కల సాకారమైంది

చేర్యాల మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ జీవన్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్‌): ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంతోపాటు ఏ, బీ, సీ, డీలుగా రిజర్వేషన్‌లు అమలు చేస్తామని సీఎం రేవంత్‌ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించడంతో మాదిగల కల సాకారమయిందని చేర్యాల మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ కామిడి జీవన్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్‌ పార్టీ నాయకులతో కలిసి ఆయన రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి కృషిచేస్తోందని, బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణలపై తీసుకున్న నిర్ణయాలే అందుకు నిదర్శమని చెప్పారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్‌ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై అసత్యపు ఆరోపణలు మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, మనోహర్‌, మహేశ్‌, పద్మారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బాలరాజు, శ్రీనివాస్‌, కనుకచంద్రం, రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

హుస్నాబాద్‌: బార్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించి, కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడారు. హన్మకొండ బార్‌ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది గంధం శివపై హన్మకొండ సీఐ, ట్రాఫిక్‌ పోలీసులు దాడి చేయడాన్ని నిరసిస్తూ విధులు బహిష్కరించామన్నారు. న్యాయవాదులపై పోలీసుల దాడులకు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, రక్షణ చట్టాలను తీసుకురావాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మురళీమోహన్‌, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నాయక్‌, న్యాయవాదులు శ్రీనివాస్‌ రెడ్డి, బాలకిషన్‌, రవీందర్‌, కిరణ్‌, ప్రవీణ్‌, రఘువీర్‌, రాజశేఖర్‌, సంపత్‌, శ్రీదేవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

మర్కుక్‌(గజ్వేల్‌): మండలంలోని అంగడి కిష్టాపూర్‌ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10:30 నుంచి 2:30 వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సుధీర్‌ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అంగడికిష్టాపూర్‌, గణేశ్‌పల్లి, చేబర్తి, వర్ధరాజ్‌పూర్‌, దామరకుంట, కర్కపట్ల, కాశిరెడ్డిపల్లి, ఎర్రవల్లి, నర్సన్నపేట గ్రామాలకు విద్యుత్‌ సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం


నరసయ్య(ఫైల్‌)

తొగుట(దుబ్బాక): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన మండలంలోని ఘనపురంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌ రావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వృద్ధుడు అక్కం నరసయ్య బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. దీంతో ఆయన కుమారుడు పర్శయ్య గురువారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్‌: మద్యం తాగి పట్టుబడిన వాహనదారులకు కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 8 మంది పట్టుపడ్డారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రూ.13 వేల జరిమానా, వారిలో ఒక్కరికి మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

జూనియర్‌ లెక్చరర్ల వినతి


వినతి పత్రం అందిస్తున్న నాయకులు

సిద్దిపేటఎడ్యుకేషన్‌: ఇంటర్మీడియెట్‌ వార్షిక పరీక్షల నిర్వహణకు అధ్యాపకుల సీనియారిటీని దృష్టిలో ఉంచుకుని విధులు కేటాయించాలని ప్రభుత్వ జూనియర్‌ లెక్చరర్ల సంఘం (జీజేఎల్‌ఏ) జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి అమరేందర్‌రెడ్డితో కలిసి జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్‌, డీఐఈఓ రవీందర్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు తమ సంఘం పూర్తి సహకారాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మధుసూదన్‌రావు, సదానందం, దేవయ్య పాల్గొన్నారు.

పాఠశాలకు తాళం వేసిన గ్రామస్తులు

● ఉపాధ్యాయులను నియమించాలి
● ఎంఈఓ మాధవరెడ్డికి వినతి


తాళం వేసి గ్రామస్తుల నిరసన వ్యక్తం

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): విద్యార్థులకు సరిపడే ఉపాధ్యాయులు లేరని, వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ మండల పరిధిలోని దౌలాపూర్‌ గ్రామస్తులు గురువారం పాఠశాలకు తాళంవేసి ఎంఈఓ మాధవరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గతేడాది 120 మంది విద్యార్థులుండగా, ఈ సారి 80 మంది విద్యార్థులు ఉన్నారని, ఉపాధ్యాయుల కొరత వల్లే విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని వాపోయారు. ఏడు తరగతులకు ముగ్గురు ఉపాధ్యాయులే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా ఫలితం లేదన్నారు. తగినంత మంది ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని లేకపోతే గ్రామంలో పాఠశాల మూతపడే అవకాశం ఉందని హెచ్చరించారు. అనంతరం ఎంఈఓ మాధవరెడ్డి మాట్లాడారు. జిల్లా విద్యాధికారితో మాట్లాడి డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయుడిని వెంటనే నియమిస్తామని హామీ ఇచ్చారు. అలాగే వారంలోగా మరో ఇద్దరిని నియమించేలా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ యాదిలక్ష్మి, నాయకులు ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జయమ్మ, భాస్కర్‌, నర్సమ్మ, పుల్లయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలి


నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏల వారసులు

ప్రభుత్వ వైఖరిపై నిరసన

చేర్యాల(సిద్దిపేట): వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని జేఏసీ నాయకులు తీవ్రంగా ఖండించారు. గురువారం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధన కోసం పోరాడుతున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడం దారుణం అన్నారు. 2022లో 80 రోజుల పాటు సాగిన సమ్మె ఫలితంగా అప్పటి ప్రభుత్వం జీఓ నంబర్లు 81, 85 విడుదల చేసిందని, వాటి ప్రకారం 20,555 మంది వీఆర్‌ఏల్లో 16,758 మందికి పదోన్నతులు కల్పించిందని చెప్పారు. అయితే మిగిలిన 3,797 మంది వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా నేటికీ ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు విన్నవించినా పట్టించుకోని ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మల్లేశం, మహేశ్‌, ప్రవీణ్‌కుమార్‌, పరశురాములు, సత్తయ్య, చంద్రమౌళి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు సత్యనారాయణ ఒక స్ఫూర్తి


నివాళులర్పిస్తున్న నాయకులు

సిద్దిపేటకమాన్‌: మాజీ ఎమ్మెల్సీ, ప్రజా జర్నలిస్టు ఆర్‌.సత్యనారాయణ ఒక స్ఫూర్తి అని ఆయన మిత్రులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు ప్రశంసించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం రాత్రి సత్యనారాయణ సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పలువురు నాయకులు నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాలు, జర్నలిస్టు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

చేర్యాల(సిద్దిపేట): బాలికలు, మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలపై గురువారం స్థానిక కేజీబీవీలో పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారితకు పెద్దపీట వేస్తున్నాయన్నారు. విద్యార్థినులు ఏకాగ్రతతో చదివి, ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులతో జాగ్రత్త వహించాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ 'ఆయిల్‌ పామ్‌'తో అధిక లాభాలు

దౌల్తాబాద్‌(దుబ్బాక): ఆయిల్‌ పామ్‌ సాగుతో లాభాలు పొందవచ్చునని దుబ్బాక ఏడీఏ మల్లయ్య అన్నారు. మండల పరిధిలోని సూరంపల్లిలోని నరేందర్‌రెడ్డి తోటలో గురువారం హార్వెస్టింగ్‌ను పరిశీలించారు. ఏఈఓ సంతోష్‌, బాపురాజు ఫీల్డ్‌ ఆఫీసర్‌ ఆంజనేయులు ఉన్నారు.

◆ లక్ష లిఖిత నామ పత్రాల అందజేత

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): హరిహర లిఖిత మహాయజ్ఞం, శ్రీరామకోటి భక్త సమాజం, సీతారామాంజనేయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రామ, శివ లక్ష లిఖిత నామ పత్రాలను నాసర్‌పుర హనుమాన్‌ ఆలయంలో రామకోటి రామరాజుకు గురువారం అందించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ లోక కల్యాణార్థం జరుగుతున్న లిఖితయజ్ఞంలో పాలుపంచుకోవడం, ప్రతి భక్తుడు భక్తితో లిఖించి అందించడం వారి భక్తికి నిదర్శనమన్నారు. శ్రీనివాసచారి, శ్రీనివాస్‌, శ్రీకాంత్‌, మధు, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

◆ వాటర్‌ డిస్పెన్సరీ ప్రారంభం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లికి చెందిన సిందిరి శ్రవణ్‌ కుమార్‌ బెజ్జంకి పోలీస్‌ స్టేషన్‌కు విరతణగా ఇచ్చిన వాటర్‌ డిస్పెన్సరీని గురువారం సిద్దిపేట రూరల్‌ సీఐ శ్రీను ప్రారంభించారు. శ్రవణ్‌ కుమార్‌ తండ్రి సిందిరి లక్ష్మణ్‌ ఇటీవల ప్రమాదవశాత్తు తోటపల్లి రిజర్వాయర్‌లో పడి మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని గుర్తించడంలో శ్రమించిన పోలీసుల సహకారానికి గుర్తుగా శ్రవణ్‌ కుమార్‌ వాటర్‌ డిస్పెన్సరినీ అందజేశారు. ఎస్‌ఐ కృష్ణారెడ్డి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ హెల్మెట్‌ తప్పనిసరి

అక్కన్నపేట(హుస్నాబాద్‌): వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ ధరించాలని ఎస్‌ఐ విజయ్‌భాస్కర్‌ పిలుపునిచ్చారు. మండలంలోని జనగామ గ్రామ స్టేజీ వద్ద రోడ్డు నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.

◆ తిరుపతి రెడ్డి ఎంపికపై హర్షం

మిరుదొడ్డి(దుబ్బాక): తెలంగాణ ప్రొగ్రెసివ్‌ టీచర్స్‌ ఫెడరేషన్‌(టీపీటీఎఫ్‌) రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన జి.తిరుపతిరెడ్డి ఎంపికపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు టీపీటీఎఫ్‌ అక్బర్‌పేట–భూంపల్లి మండలశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తిరుపతిరెడ్డి 30 యేళ్లుగా నిబద్ధతతో పనిచేశారన్నారు.

◆ బీసీలను అణగదొక్కే కుట్ర

మిరుదొడ్డి(దుబ్బాక): సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలను అణగదొక్కే కుట్ర చేస్తోందని బీసీ సంఘం జిల్లా నాయకుడు కంచం యాదగిరి మండిపడ్డారు. గురువారం ఆయన మాట్లాడుతూ తప్పుల తడకగా ఉన్న కులగణన సర్వే వల్ల బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. 2014 సమగ్ర కుటుంబ సర్వేలో బీసీ జనాభా కోటి 85 లక్షలపైగా ఉండగా ఇప్పుడు కోటి 64లక్షలుగా తగ్గించి చూపారన్నారు.

కులగణన పేరుతో వంచన

బెజ్జంకి(సిద్దిపేట): కులగణన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం బీసీలను వంచిస్తోందని యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దోనె అశోక్‌ ఆరోపించారు. బెజ్జంకిలో గురువారం ఆయన మాట్లాడారు. నాయకులు సురేశ్‌, ప్రశాంత్‌, వెంకటేశ్‌, రంజిత్‌గౌడ్‌, కొమురయ్య, లక్ష్మణ్‌ పాల్గొన్నారు.

◆ ఎమ్మెల్సీపై చర్యలేవి?

దుబ్బాకటౌన్‌: రెడ్డి కులాన్ని అవమానించేలా మాట్లాడిన ఎమ్మెల్సీ తీన్మార్‌ మల్లన్నపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ దుబ్బాక రెడ్డి జేఏసీ నాయకుడు కిష్టంగారి సుభాష్‌రెడ్డి, గడిల జనార్దన్‌ రెడ్డి గురువారం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తీన్మార్‌ మల్లన్న వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు. నాయకులు బుచ్చిరెడ్డి, రాజిరెడ్డి, జీవన్‌ రెడ్డి, కృష్ణారెడ్డి, నరేశ్‌ రెడ్డి, శ్రీనివాస్‌ రెడ్డి తదితరులున్నారు.

◆ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గజ్వేల్‌రూరల్‌: కేజీబీవీ, సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్‌ నాయకులు డిమాండ్‌ చేశారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లోని పాఠశాలు, పట్టణంలోని కేజీబీవీలో గురువారం పర్యటించి ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను తెలుసుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు పాపిరెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్‌, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, విద్యాసాగర్‌ మాట్లాడారు. నాయకులు ఎల్లయ్య, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

◆ కృష్ణ మాదిగను కలిసిన నాయకులు

హుస్నాబాద్‌: ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగను స్థానిక నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కృష్ణ మాదిగ ఇటీవల పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన విషయం తెలిసిందే. కలిసిన వారిలో లక్ష డప్పుల సాంస్కృతిక ప్రదర్శన రాష్ట్ర కో ఆర్డినేటర్‌ సంపత్‌ కుమార్‌, ఎమ్మార్పీఎస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటస్వామి, నాయకులు సాయన్న, అశోక్‌ తదితరులు ఉన్నారు.